

ఎవరేమన్నారంటే..

అంకెల గారడీయే



కేంద్ర బడ్జెట్ అంకెల గారడీలా ఉంది. తాత్కాలిక బడ్జెట్‌లో ఏమీ ఉండదు. కేవలం రెండు నెలల బడ్జెట్ ఇది. ఈ బడ్జెట్ ఎన్నికల స్టంటే! ఇది పేదల వ్యతిరేక బడ్జెట్. ఏటా కోటి ఉద్యోగాల హామీని విస్మరించారు. వ్యవసాయం, రైతు సంక్షేమాన్ని పెద్దగా పట్టించుకోలేదు. సాగునీటి జలాల కేటాయింపుపై వివక్ష చూపారు.

- రామ్మోహన్‌రెడ్డి, వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే

కొత్తదనం లేదు



బడ్జెట్‌లో కొత్తదనమేమీ లేదు. అప్పటి సీఎం కేసీఆర్ అమలు చేసిన పథకాలే కేంద్ర బడ్జెట్ లోనూ కనిపిస్తున్నాయి. నిర్మలది పేదల వ్యతిరేక బడ్జెట్. వ్యవసాయ రంగానికి కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. విద్య, వైద్య రంగాలకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వలేదు.

- కె.మహేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పరిగి

పేదలకు ప్రయోజనం చేకూర్చని బడ్జెట్



ఈ బడ్జెట్‌తో నిరుపేదలకు ఎలాంటి ప్రయోజనం చేకూరదు. బడా వ్యాపారులకు మేలు చేసేలా బడ్జెట్‌ను తయారు చేశారు. మైనార్టీలకుక అంతంత మాత్రంగా నిధులు కేటాయించారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణకు రావాల్సిన నిధులు కేటాయించలేదు.

- సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు

మహిళలకు ఎలాంటి ప్రయోజనాలూ లేవు



కేంద్ర బడ్జెట్‌తో మహిళలకు ఎలాంటి ప్రయోజనాలు కలిగేలా లేవు. అన్ని రంగాల మాదిరిగానే మహిళా రంగాలకు కూడా మొండి చేయి చూపారు. వంట గ్యాస్ ధర తగ్గించి ఉంటే బాగుండేది. మహిళా సంఘాలకు, మహిళా చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాలు వంటివేమీ ప్రకటించలేదు.

- శైలజ విజయేందర్‌రెడ్డి, జడ్పీటీసీ, మేడ్చల్

వేతన జీవులకు మొండిచెయ్యి



బడ్జెట్‌లో ఆదాయ పన్ను మినహాయింపులు పెంచకపోవడంతో వేతన జీవులకు నిరాశే మిగిలింది. సెక్షన్ 80(సి) కింద 1.5 లక్షలుగా ఉన్న మినహాయింపులను రూ.5లక్షలకైనా పెంచుతారని ఆశలతో ఉన్న వేతన జీవులపై కేంద్రం నీళ్ల చల్లింది. పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.2.5లక్షలుగా ఉన్న స్టాండర్డ్ తగ్గింపులను రూ.5లక్షలకు పెంచితే బాగుండేది.

- ఏవీ.సుధాకర్, ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అదనపు కార్యదర్శి

ఇది ఎన్నికల బడ్జెట్



బడ్జెట్ పూర్తిగా పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ గెలవాలనే బడ్జెట్ రూపకల్పన చేసినట్టుంది. బడ్జెట్ పథకాలు రైతు, బడుగు వర్గాలకు, అసంఘటిత కార్మికులకు మేలు చేయని బడ్జెట్ ఇది. అంగన్వాడీలను, ఆశా వర్కర్లను, భోజన కార్మికులను రెగ్యులరైజ్ చేయకపోవడం విచారకరం. విద్య, వైద్యాలకు కేటాయింపులు సరిపోవు.

- విజయలక్ష్మీపండిత్, సీపీఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి

కార్మికులకు, విద్యార్థులకు తీరని అన్యాయం



కార్మికులు, కర్షకులు, విద్యార్థులకు ఈ బడ్జెట్‌తో ఎలాంటి ప్రయోజనం చేకూరదు. కేవలం పెట్టుబడిదారులను ప్రోత్సహించేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టి చేతులు దులుపుకున్నారు. ఈ తాత్కాలిక బడ్జెట్‌లో ప్రతీ రంగానికి అన్యాయమే జరిగింది.

- ఎర్ర అశోక్, సీఐటీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు

అన్నివర్గాల అభ్యున్నతికి పాటుపడేలా



అన్నివర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి పాటుపడేలా బడ్జెట్‌ను రూపొందించారు. యువతకు అన్ని విధాలా ప్రోత్సహించేలా ఉంది. రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమానికి పాటుపడేలా కేంద్రం చర్యలు తీసుకుందనేది ఈ బడ్జెట్‌తో నిరూపితమైంది.

- విక్రమ్‌రెడ్డి, బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు

మోదం.. ఖేదం!

మరింత మంది రైతులకు పంటల బీమా

- వేతన జీవులకు లభించని ఊరట
- సోలార్ విద్యుత్ గ్రిడ్‌తో శివార్లకు ఎక్కువ ప్రయోజనం
- ఆశా, అంగన్‌వాడీలకు ఆయుష్మాన్ భారత్ వర్తింపు
- పీఎం ఆవాస్ యోజనతో ఎక్కువ మంది పేదలకు లబ్ధి
- ఉపాధి కూలీలకు నిరాశ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ఆశించినంత ఆకర్షణీయంగా లేనప్పటికీ పేద, మధ్య తరగతి వర్గాలతో పాటు రైతులకు మాత్రం కాసింత ప్రయోజకరంగా ఉంది. గతంతో పోలిస్తే మౌలిక సదుపాయాలు, తదితర రంగాలకు కేటాయింపులు పెంచినప్పటికీ మరికొన్ని రంగాలకు కేటాయింపులు తగ్గించేశారు. రైతులను పేదలను ఆకర్షించే విధంగా బడ్జెట్ ఉంది. పర్యాటక, హౌసింగ్ రంగాల అభివృద్ధికి నిధులు పెంచారు. పద్దుల్లో వేతన జీవులకు ఊరట కలిగించలేదు. పన్ను విధానాల్లో మార్పులకు కేంద్రం సముఖత చూపకపోవడం గమనార్హం. రైల్వేకి సంబంధించి కొత్త ప్రతిపాదనలు ఏవీ కార్యరూపం దాల్చలేదు. మధ్యంతర బడ్జెట్ కావడంతో వీటి జోలికి ప్రభుత్వం వెళ్లలేదు.



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ అందరికీ ఆనందాన్ని పంచలేక పోయింది. కొన్ని వర్గాలకు కాస్త ఊరట లభించనుండగా, మరి కొన్ని వర్గాలను నిరుత్సాహానికి గురిచేసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టే బడ్జెట్‌పై అన్ని వర్గాల ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అయితే, తీరా బడ్జెట్‌ను చూస్తే ఎక్కువ మందిని నిరాశకే గురి చేసింది. బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకుంటే ఉసూరుమనిపించిందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా పేదలకు కూలి పనులు కల్పించే ఉపాధి హామీ పథకానికి ఐదు శాతం నిధులు తగ్గించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వేతన జీవులకు ఊరట కరువు



పన్నుల విషయంలో మరింత ఊరట ఉంటుందని వేతన జీవులు భావించారు. అయితే, పన్ను విధానాల్లో ఎలాంటి మార్పులూ చేయలేదు. అయితే, కొన్ని వివాదాస్పదమైన ప్రత్యక్ష పన్నుల డిమాండ్లను ఉపసంహరించుకున్నారు. దీని వల్ల అనేక మంది పన్ను చెల్లింపుదార్లకు కొంత ప్రయోజనం కలగనుంది.



సొంతింటి కలకు ప్రోత్సాహం

హౌసింగ్ ఫర్ మిడిల్ క్లాస్ పేరుతో ఇళ్ల కొనుగోలు, సొంతింటి నిర్మాణానికి ప్రోత్సాహం అందించేందుకు హౌసింగ్ స్కీమ్ తీసుకువచ్చారు. మహిళలను లక్షాధికారులను చేసేందుకు అమలు చేస్తున్న లక్‌పతి దీదీ పథకానికి నిధులు పెంచారు. దీంతో ఈ పథకం కింద మరింత మందికి ప్రయోజనం కలగనుంది.

పర్యాటక రంగానికి ఊతం

పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు రాష్ట్రాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని అనంతగిరి, కీసర వంటి పర్యాటక ప్రాంతాలకు మేలు జరగనుంది.



పెరగనున్న సోలార్ విద్యుత్తు ఉత్పత్తి



పీఎం సూర్యోదయ యోజన కింద సోలార్ వాడకాన్ని మరింత పెంచనున్నారు. రూఫ్‌టాప్ సోలార్ ద్వారా కోటి ఇళ్లకు 300 యూనిట్లు ఉచితంగా ఇవ్వనున్నారు. ఇందుకోసం రూ.8500 కోట్లతో గ్రిడ్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కారణంగా ఉమ్మడి జిల్లాలో కొన్ని లక్షల మందికి ప్రయోజనం కలగనుంది. ప్రధానమంత్రి సూర్యోదయ యోజన పథకం వల్ల నగర శివార్లలో సోలార్ విద్యుత్తు ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం నగర శివార్లలో 10వేలకు పైగా సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు ఉన్నాయి. నగర శివార్లలో పెద్దసంఖ్యలో అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు కొత్తగా వస్తున్నందున ఈ పథకాన్ని ఎక్కువ మంది వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయి.

వ్యవసాయానికి స్వల్ప కేటాయింపులు



వ్యవసాయానికి ఈ సారి స్వల్పంగా కేటాయింపులు పెంచారు. అయితే యూరియాపై సబ్సిడీ మాత్రం గణనీయంగా తగ్గించారు. నానో యూరియా మాదిరిగానే నానో డీఏపీ అందజేస్తామని కేంద్ర మంత్రి వెల్లడించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో పది లక్షల మందికి పైగా రైతులకు ఊరట కలగనుంది. పాడిపంటల ప్రోత్సాహానికి సమగ్ర కార్యక్రమం చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు.

ఈ పథకాల ద్వారా మరింత మందికి మేలు

కీలక పథకాలకు గత ఏడాదితో పోలిస్తే నిధులు పెంచారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా వచ్చే అయిదేళ్లలో రెండు కోట్ల మంది పేదలకు ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించారు. బస్తీలు, అద్దె ఇళ్లలో ఉండే వారికి పీఎం ఆవాస్ యోజన కింద ఈ ఇళ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇందుకు అనుగుణంగా నిధులు పెంచారు. దీంతో ఈ పథకం కింద ఈ ఏడాది ఎక్కువ మంది పేదలకు లబ్ధి చేకూరనుంచి. ఇక తాగునీటి సమస్యల పరిష్కారం కోసం గణనీయంగా నిధులు పెంచారు. అలాగే పంటల బీమా పథకం, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన, వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి, అన్నదాత సంరక్షణ యోజన పథకాలకు నిధులు భారీగా పెంచారు.

ఉపాధి పథకానికి దెబ్బ



మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకానికి నిధులు తగ్గించారు. దీంతో ఉపాధి పనులపై ఆధారపడిన పేదలపై ప్రభావం పడనుంది. గతంతో పోలిస్తే దాదాపు 5శాతం నిధులు తగ్గించారు. అలాగే పాటు జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం నిధులు కూడా పెంచలేదు.

ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం



వికారాబాద్, ఫిబ్రవరి 1: జిల్లాలో ప్రభుత్వ, రికగ్నైజ్డ్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులకు 2023-24 విద్యాసంవత్సరానికి స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి గురువారం తెలిపారు. విద్యార్థుల వివరాలతో హెచ్‌ఎంలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలని ఆమె సూచించారు. దరఖాస్తు ధ్రువపత్రాలను జిల్లా వెల్ఫేర్ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9502912981 నంబర్‌లో సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

ఆపరేషన్ స్మైల్ ద్వారా 162 మంది బాలలకు పని నుంచి విముక్తి



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 1 : ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా 162 మంది బాలలకు పని నుంచి విముక్తి కల్గించామని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. గురువారం ఆపరేషన్ స్మైల్-10 ముగింపు సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. నెల ఆరంభం నుంచి ఆఖరు వరకు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్‌లో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో వివిధ పనుల్లో ఉన్న 162 మంది బాలలను గుర్తించి స్కూళ్లలో జాయిన్ చేశామన్నారు. బాలల భవిష్యత్తును కాపాడటం గొప్ప విషయం అని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి పిల్లలను కాపాడటం తమకు సంతోషాన్ని ఇస్తోందన్నారు. మొత్తం 11 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామన్నారు. జనవరిలో గుర్తించిన 162 మంది బాలల్లో 150 మంది బాలురు, 12 మంది బాలికలు ఉన్నారన్నారు. వారిలో 44 మంది ఇతర రాష్ట్రాల వారన్నారు. స్కూలు వెళ్లే వయసున్న బాలలను ఎవరైనా పనుల్లో పెట్టుకుంటే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. బడీడు బాలబాలికలు ఉండాల్సింది పనుల్లో కాదు.. బడుల్లో అని ఆయన అన్నారు. దీనిపై పౌరులు, తల్లిదండ్రులు అందరూ ఆలోచించాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, తమ ప్రాంతాల్లో ఎవరైనా బాలలతో పనులు చేయించినా, బిక్షాటన చేయించినా, ఫ్యాక్టరీల్లో పనిలో పెట్టుకున్నా వెంటనే పోలీస్ అధికారులకు కానీ లేదా డైల్100కి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. ఆపరేషన్ స్మైల్‌లో పాల్గొన్న అధికారులకు ఈ సందర్భంగా ప్రశాంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎల్‌వో శ్రీనివాస్‌రావు, ఐటీసీటీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్ఐలు, బాలల సంక్షేమ శాఖ అధికారులు నరేష్‌కుమార్, ఆంజనేయులు, షఫీ, చైల్డ్‌లైన్ తరఫున ఆనంద్, మహేష్, కార్మిక శాఖ నుంచి వినాయకరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో 'ప్రత్యేక' పాలన!

- నేటి నుంచి పంచాయతీల్లో స్పెషలాఫీసర్ల రూల్
- జిల్లాలో 566 పంచాయతీలకు 163 మంది గెజిటెడ్ అధికారుల నియామకం
- నేడు అధికారులు బాధ్యతల స్వీకరణ



వికారాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. దీంతో పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం కానుంది. జిల్లాలో 566 పంచాయతీల్లో గురువారంతో పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. శుక్రవారం నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రామాల్లో సర్పంచ్‌ల స్థానాల్లో ప్రత్యేకాధికారులను నియమించారు. గెజిటెడ్ హోదా కలిగిన 11కేటగిరీల అధికారులకు పంచాయతీలను కేటాయించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీవోలు, ఎంఈవోలు, మండల వ్యవసాయాధికారులు, వివిధ శాఖల ఏఈఈలను ప్రత్యేకాధికారులుగా నియమించారు. స్పెషలాఫీసర్లుగా వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులనూ నియమించారు. ఒక్కో గజిటెడ్ అధికారికి రెండు నుంచి మూడు, నాలుగు పంచాయతీలు అప్పగించగా, పంచాయతీలు ఎక్కువ ఉన్న మండలాల్లో అయిదారు పంచాయతీలను అప్పగించారు. జిల్లాలో గల 566 పంచాయతీలకు 163మంది గజిటెడ్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సర్పంచ్‌లు, ఉపసర్పంచుల నుంచి డిజిటల్ కీలను, జాయింట్ చెక్ పవర్‌ను, ఇతర రికార్డులను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం పంచాయతీల కార్యదర్శులను ఆదేశించింది. ప్రత్యేకాధికారులు శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరిస్తారు. తమకు కేటాయించిన పంచాయతీల పాలనా వ్యవహారాలను పరిశీలించనున్నారు.

పెండింగ్‌లో బిల్లులు... ఆవేదనలో సర్పంచ్‌లు

ఐదేళ్ల కింద సర్పంచ్‌లుగా ఎన్నికైన మొదట్లో ఉత్సాహంగా పనిచేశారు. ఆ తరువాత ప్రభుత్వం నుంచి సరిగా నిధులు విడుదల కాక ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. అప్పుల పాలై సర్పంచ్‌లు మానసిక వేదనకు గురయ్యారు. బిల్లులు వస్తాయని ఆరు నెలలుగా ఎదురు చూస్తున్నా వారికి నిరాశే మిగిలింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల నుంచి రావాల్సిన నిధులు విడుదల చేయలేదు. పల్లె ప్రగతి కార్యక్రమంలో ప్రకృతివనాలు, మొక్కలు కొని నాటారు. కొన్ని గ్రామాల్లో పారిశుధ్య, సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల మరమ్మతులు, మొరం పనులు, ఇతర పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పలుచోట్ల పంచాయతీ భవనాల నిర్మాణ పనులు పూర్తయినా ఇంకా బిల్లులు రాలేదు. ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్), డీఎంఎఫ్‌టీ, ఎన్ఆర్ఈజీఎస్, మన ఊరు-మన బడి కార్యక్రమాల ద్వారా చేపట్టిన పనులు పూర్తయినా బిల్లులు రాలేదు. కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని చోట్ల పంచాయతీల నిధులను విద్యుత్ బిల్లులు, సిబ్బంది వేతనాలు, ట్రాక్టర్ల నెలసరి వాయిదాల చెల్లింపులతో చిన్న పంచాయతీల్లో నయా పైసా మిగల్లేదు.

పొడిగింపు లేక సర్పంచుల్లో నిరాశ

పంచాయతీ ఎన్నికలు జరిగేంత వరకు తమనే పర్సన్ ఇన్‌చార్జులుగా నియమిస్తారనే ఆశలో సర్పంచ్‌లు ఉండగా.. ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనకే మొగ్గు చూపింది. కొందరు సర్పంచులు తమనే కొనసాగించాలని హైకోర్టును ఆశ్రయిస్తే.. వారి అభ్యర్థనపై విచారణను కోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది. దీంతో ప్రత్యేకాధికారుల పాలన మనుగడలోకి రాక తప్పని పరిస్థితి ఏర్పడింది. ప్రత్యేకాధికారులుగా గజిటెడ్ ఆఫీసర్లనే నియమించాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆ మేరకు కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేశారు.

మేడ్చల్ జిల్లాలో 61 పంచాయతీలకు ప్రత్యేకాధికారుల నియామకం

కీసర: సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో మేడ్చల్ జిల్లాలో గల 61 పంచాయతీలకు కలెక్టర్ గౌతమ్ ప్రత్యేక అధికారులను నియమించారు. 2019 ఫిబ్రవరి 1న సర్పంచ్‌లు బాధ్యతలు స్వీకరించగా 2024 ఫిబ్రవరి 1న వారి పదవీ కాలం ముగిసింది. దీంతో మేడ్చల్ మండలంలోని 17 పంచాయతీలు, శామీర్‌పేటలో 10, కీసరలో 10, మూడుచింతలపల్లిలో 13, ఘట్‌కేసర్ మండలంలో గల 11 పంచాయతీలకు కలెక్టర్ గెజిటెడ్ అధికారులను నియమించారు.

కొడంగల్‌కు మెడికల్ కళాశాల

- నర్సింగ్, ఫార్మసీ, ఫిజియోథెరపీ కాలేజీలు కూడా!

వికారాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కొడంగల్ : ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి మహర్దశ పట్టనుంది. ఇప్పటికే నియోజకవర్గ అభివృద్ధికి కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ(కడా) ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. విద్యా సంస్థల ఏర్పాటుపై దృష్టి సారించింది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్, ఫార్మసీ, ఫిజియోథెరపీ కాలేజీల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించింది. ఈ కాలేజీలన్నీ ఒకే ప్రాంగణం(క్యాంపస్)లో ఏర్పాటు చేసేలా స్థలాన్ని గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. సీఎం ఆదేశాలతో తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(టిమ్స్) డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శివరాం, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి గురువారం కొడంగల్ సమీప ఉడుమేశ్వరం, అప్పాయిపల్లి, బొంరాస్‌పేట్, నాగిరెడ్డిపల్లి ప్రాంతాల్లో పరిశీలించారు. కొడంగల్-తాండూరు మార్గంలో అప్పాయిపల్లి వద్ద 70 ఎకరాలు, బొంరాస్‌పేట్ మండలం, నాగిరెడ్డిపల్లి వద్ద 39ఎకరాల ప్రభుత్వ భూములు, బొంరాస్‌పేట్ వద్ద 231 ఎకరాల అటవీ భూమిని పరిశీలించారు. ఉడుమేశ్వరం వద్ద నిర్మిస్తున్న బీసీ బాలుర గురుకుల భవనాన్ని సందర్శించారు. కొడంగల్‌లోని 50పడకల సామాజిక ఆసుపత్రిని 100 పడకలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. మెడికల్ కాలేజీకి దీన్ని బోధనాసుపత్రిగా ఆధునికీకరిస్తారు. కొడంగల్ నుంచి అప్పారెడ్డిపల్లి 4.5 కిలోమీటర్లు, నాగిరెడ్డిపల్లి 9 కిలోమీటర్లు, బొంరాస్‌పేట్ 14 కిలోమీటర్ల దూరం ఉన్నాయి. ఆస్పత్రికి దగ్గరలోనే మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తారు.ఇందుకు ఉడుమేశ్వరం బీసీ గురుకుల భవనాన్నే వాడుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం.

సీఎం నిర్ణయం మేరకే స్థలం ఎంపిక

కొడంగల్ నియోజకవర్గంలో మెడికల్, అనుబంధ కళాశాలల ఏర్పాటుకు ప్రతిపాదిత నాలుగు స్థలాల్లో సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకే ఎక్కడనేది నిర్ణయిస్తారు. స్థలాలవిస్తీర్ణం వివరాలు, మ్యాప్‌లతో సీఎంకు అధికారులు నివేదిక అందజేస్తారు.

వైద్య కళాశాల ఏర్పాటుకు స్థలసేకరణ వివరాలివ్వాలి



అధికారులు, వైద్యులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

కొడంగల్/బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 1 : కొడంగల్ నియోజకవర్గంలో ప్రభుత్వ వైద్య, విద్య, నర్సింగ్, ఫార్మాసిటీ, ఫిజియోథెరపీ కాలేజీల ఏర్పాటుకు స్థల సేకరణ వివరాలు అందజేయాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కొడంగల్ మండలం ఉడిమేశ్వరం సమీపంలో నిర్మిస్తున్న బీసీ గురుకుల పాఠశాల, అప్పాయిపల్లి, బొంరాస్‌పేట్, నాగిరెడ్డిపల్లి ప్రాంతాల భూములను కిమ్స్ డైరెక్టర్ డాక్టర్ విమలథామస్, వైద్య విద్య డైరెక్టర్ శివరాంలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూములకు సంబంధించిన వివరాలు, విస్తీర్ణం, మ్యాప్‌లు అందజేయాలని సూచించారు. కొడంగల్‌లో గల 50 కమ్యూనిటీ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా విస్తరించేందుకు స్థలాన్ని కిమ్స్ డైరెక్టర్ విమల పరిశీలించారు. ప్రస్తుత ఆస్పత్రి స్థల వివరాలు, అదనంగా నిర్మాణం చేపట్టేందుకు వీలుగా ఖాళీ స్థల వివరాలు, మ్యాప్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ బి.విజయ్‌కుమార్, డీసీహెచ్ఎస్ ప్రదీప్, ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రప్రియ, డాక్టర్లు వీణ, సాకేత్, బీసీ గురుకులం రీజినల్ కో-ఆర్డినేటర్ యాదయ్యగౌడ్, ప్రిన్సిపాల్ శంకర్ పాల్గొన్నారు.

భూమిని కాపాడుకుందాం

వికారాబాద్, ఫిబ్రవరి 1: కర్బన ఉద్గారాలు పెరగడంతో భూమి వేడెక్కుతుందని, ఆ సందర్భంలో భూమిని కాపాడుకోవాలని పలువురు వక్తలు అన్నారు. యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాంలో భాగంగా తెలంగాణ పాఠశాల విద్యాశాఖ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్ మామ్దాన్ పల్లి, కిష్టాపూర్ పాఠశాలల్లో 'పర్యావరణ సమతుల్యత, భూమిని కాలుష్య కోరలో నుంచి కాపాడడం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రెడ్డి హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. లీడ్ ఎర్త్ లీడర్స్‌గా ఎంపికైన ఎనిమిది మంది విద్యార్థులకు బ్యాడ్జిలను అందించి, అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. హెచ్ఎం శ్రీ.రాంరెడ్డి, పాఠశాల యంగ్ ఎర్త్ లీడర్స్ ఇన్‌చార్జి మహిపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు ఎన్. ఇందిర, పి.హేమలత, కె.వరలక్ష్మి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, జె.శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులకు పంచాయతీ పవర్

● నేటి నుంచి బాధ్యతల స్వీకరణ ● స్వాగతం పలుకుతున్న సవాళ్లు

తాండూరు, ఫిబ్రవరి 1: సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో నేటి(శుక్రవారం) నుంచి వివిధ గ్రామపంచాయతీలకు ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారులు పలు సమస్యలు, సవాళ్ల మధ్య బాధ్యతలు స్వీకరించనున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం పొడిగించాలని కోరుతూ స్టేవిధించాలని పలువురు చేసిన విజ్ఞప్తిని హైకోర్టు తిరస్కరించడంతో ప్రత్యేకాధికారుల పాలనకు లైన్‌క్లియర్ అయింది. దాంతో వారి చేతికి పంచాయతీ పవర్ వెళ్లనుంది. పెండింగ్ బిల్లుల చెల్లింపు, తాగునీటి, వీధి దీపాల నిర్వహణ, ట్రాక్టర్ల కిస్తీల చెల్లింపు, ఉపాధిహామీ పథకం అమలు, వంటివి కొత్తగా నియమితులయ్యే ప్రత్యేకాధికారులకు సవాల్‌గా మారనున్నాయి. చిన్నగ్రామ పంచాయతీలు నిధుల కొరతతో సతమతమవుతున్నాయి. తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, తాండూరు, కోట్‌పల్లి మండలాల్లో కలిపి 153, సబ్‌డివిజన్ పరిధిలో బొంరాస్‌పేట్ మండలంలో 47, కొడంగల్‌లో 26, దౌల్తాబాద్‌లో 33, గ్రామ పంచాయతీలున్నాయి.

9 అంశాలపై పని చేయాలి

ప్రత్యేకాధికారులు 29 అంశాల ఆధారంగా పని చేయాలి. వాటిలో కేవలం 9 అంశాలు మాత్రమే పూర్తి స్థాయిలో పంచాయతీలకు బదాలాయించారు. విద్య, వైద్య , పశుసంవర్థక, రెవెన్యూ, స్త్రీ, శిశు సంక్షేమం, వ్యవసాయశాఖ, మత్స్యశాఖ, డిఆర్‌డిఏ, విద్యుత్ శాఖలున్నాయి.

ప్రత్యేకాధికారుల బాధ్యతలివే

పంచాయతీ కార్యదర్శులతో ఎప్పటికప్పుడు సమీక్షించాలి. పంచాయతీ స్థిరాస్తులు, ఆదాయ వనరులపై దృష్టి సారించాలి. పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, విద్యుత్ సమస్యపై దృష్టి సారించి పర్యవేక్షించాలి. గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పని కల్పించాలి. గ్రామపంచాయతీ లెక్కలు, అభివృద్ధి పనులు చేయిస్తే ఎంబి రికార్డు చేయించాలి. ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామసభ నిర్వహించాలి. బాధ్యతలు తీసుకున్న వెంటనే రికార్డులు, లాగిన్లను స్వాధీనం చేసుకొని, విలేజ్ ప్రొఫైల్ తయారు చేసుకోవాలి.

సిబ్బంది కొరత

కొత్తగా ఏర్పడిన చిన్న పంచాయతీలలో సిబ్బంది కొరత ఉంది. చాలా గ్రామాల్లో సర్పంచ్‌లు సొంత డబ్బులతో వేతనాలు చెల్లించి కార్మికులను కొనసాగించారు. మరికొన్ని చోట మల్టీపర్పస్ వర్కర్లుగా కొనసాగుతున్నారు. అవసరం మేరకు పారిశుధ్య, విద్యుత్ సిబ్బంది కొరత ఉంది.

బీజాపూర్ హైవే పనులకు గ్రీన్‌సిగ్నల్

● తక్షణమే పనులు చేపట్టాలని కేంద్రమంత్రి గడ్కరీ ఆదేశం

● తాండూరు - బీదర్, మన్నెగూడ - తాండూరు రోడ్ల విస్తరణ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): కొన్నాళ్లుగా నిలిచిపోయిన హైదరాబాద్- బీజాపూర్ హైవే విస్తరణ పనులను తక్షణమే చేపట్టాలని కేంద్రరోడ్డు, రవాణాశాఖ మంత్రి గడ్కారీ ఉన్నతాధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణ పనులపై గురువారం రాష్ట్రమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కేంద్ర మంత్రి గడ్కారీతో భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో పాటు రాష్ట్ర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా రీజినల్ రింగురోడ్డు పనులతో పాటు పలు పెండింగ్ పనులను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న హైదరాబాద్-బీజాపూర్ హైవే విస్తరణ పనులను చేపట్టాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మనోహర్‌రెడ్డి కోరారు. పర్యవరణ అనుమతులు కూడా వచ్చాయని, దీనికి సంబంధించిన కోర్టు వివాదాలు కూడా పరిష్కారమైనట్లు వారు తెలిపారు. దీనిపై వెంటనే గడ్కారీ స్పందిస్తూ వెంటనే ఈపనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా తాండూరు నుంచి బీదర్‌కు, మన్నెగూడ నుంచి తాండూరు రోడ్లు విస్తరణ కూడా చేపట్టాలని మంత్రి, ఎమ్మెల్యే కోరారు. దీనికి గడ్కారీ సానుకూలంగా స్పందించి ఈ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఉప్పల్ బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా పూర్తిచేస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ రోడ్ల నిర్మాణాల విషయంలో కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించడం సంతోషకరమని, త్వరలోనే స్థానిక ప్రజల కష్టాలు తీరతాయని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రజాసేవతోనే చిరకాలం గుర్తింపు



మూడుచింతలపల్లి: కేశవరం సర్పంచ్ జ్యోతిబలరాంగౌడ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

మోమిన్‌పేట్ , ఫిబ్రవరి 1: ప్రజా సేవతోనే చిరకాలం గుర్తింపు లభిస్తుందని సొసైటీ చైర్మన్ బి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మోమిన్‌పేట్ మండలంలోని టేకులపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో పంచాయతీ పాలకవర్గ సభ్యులకు వీడ్కోలు సన్మాన సభను నిర్వహించారు. ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో పారిశుధ్య కార్మికుల పాత్ర క్రియాశీలకమన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు నర్సింహులు, శాంసంగ్, రాజశేఖర్, సర్దార్, మంజులకు తులభారం నిర్వహించి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. సర్పంచ్ నవనీత విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ రైస్, పాలక వర్గ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, పారిశుధ్య కార్మికులకు టేకులపల్లి గ్రామ యువజన సంఘాలు, శ్రీహనుమాన్ యూత్ సహారా, భవానీ యూత్, అంబేడ్కర్ యూత్, శివాజీ యూత్, గణేశ్ యూత్, గొల్ల కురుమ సంఘం సభ్యులు, ఆటో యూనియన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాల్, సొసైటీ చైర్మన్ బి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, శనీశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, ఎంపీవో యాదగిరి, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టి పెరిగిన గ్రామానికి సేవలందించడం వరం

మూడుచింతలపల్లి: పుట్టి పెరిగిన గ్రామానికి సేవలందించడం ఒక గొప్ప వరమని కేశవరం గ్రామ సర్పంచ్ జ్యోతిబలరాంగౌడ్ అన్నారు. కేశవరం గ్రామ పంచాయితీ పదవీకాలం పూర్తయిన సందర్భంగా గ్రామస్తులు గురువారం పాలకవర్గానికి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ హన్మంతరెడ్డి, పంచాయితీ కార్యదర్శి గౌతమి, సిబ్బంది పాల్గొన్నారు.

కొడంగల్: కొడంగల్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లకు గురువారం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో సన్మానించారు. మండలంలోని సర్పంచ్‌లు బాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, పకీరప్ప, రమేశ్‌రెడ్డి, అనంతమ్మ, శంకర్‌నాయక్‌లను ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.ఆనంద్‌రెడ్డి తదితరులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యస్.సోమశేఖర్, ఎన్నుల భాస్కర్, అంబయ్యగౌడ్, అమరేందర్‌గౌడ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: మండలంలోని సంగెంకలాన్ గ్రామంలో సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్‌తోపాటు ఉపసర్పంచ్ నాగమ్మ, వార్డు సభ్యులు మాజీ సర్పంచ్ నారాయణగౌడ్‌తోపాటు పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, ఉపాధ్యాయులను గ్రామస్తులు పాఠశాల వద్ద ఘనంగా సన్మానించారు. ఐదేళ్లపాటు మేఘనాథ్‌గౌడ్ గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారని ఆయన సేవలు కొనియాడారు. రాబోవు రోజుల్లో మరిన్ని పదవులు పొంది ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, హెచ్ఎం శ్రీనివాస్, గ్రామపెద్దలు బస్వరాజ్‌పాటిల్, సోంశేఖర్, అమర్‌నాథ్‌గౌడ్ తదితరులున్నారు. అదేవిధంగా సంగెంకలాన్ పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో గ్రామస్తులు వారిని సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామాన్ని సందర్శించిన జిల్లా వ్యవసాయాధికారి గోపాల్‌ను గ్రామస్తులు, పాలక వర్గం ప్రతినిధులు సన్మానించారు.

యాలాల: యాలాల మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామంలో గ్రామసర్పంచ్, వార్డు సభ్యులను గురువారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. గ్రామసర్పంచ్‌ల పదవీకాలం బుధవారం ముగిసింది. దీంతో గ్రామ పెద్దలు, గ్రామస్థులు గురువారం గ్రామంలో సమావేశమై 5 సంవత్సరాలు గ్రామంలో పనిచేసిన సర్పంచ్ లక్ష్మీదేవి, ఉపసర్పంచ్ నర్సింహులు, వార్డు సభ్యులు శేఖర్, వడ్డె క్రిష్ణయ్య, సత్యమ్మ, లచ్చమ్మ, రాములమ్మ, ఉషణమ్మ, సరోజలను సన్మానించారు. గడిచిన 5 సంవత్సరాలు గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు మంచి పాలనా అందించారని గ్రామస్థులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అమర్‌నాథ్‌రెడ్డి తదితరులున్నారు.

పంచాయతీలకు ప్రత్యేకాధికారుల నియామకం

కొడంగల్ రూరల్: సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గురువారం నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. కొడంగల్ మండలంలోని 26గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించారు.

బషీరాబాద్: మండలంలోని 36 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో రమేష్ తెలిపారు.

తాండూరు రూరల్: మండలంలోని 33 గ్రామపంచాతీలకు ప్రభుత్వం గెజిటెడ్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించినట్లు తాండూరు ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వారు శుక్రవారం(నేటి) నుంచి విధుల్లో చేరనున్నట్లు తెలిపారు. వారంతా గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు తీసుకుని గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

మోమిన్‌పేట్: మండలంలోని 28గ్రామాలకు ప్రత్యేకారులను నియమించినట్లు ఎంపీడీవో శైలజారెడ్డి తెలిపారు.

శామీర్‌పేట: మండలంలోని పది గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు. జనవరి 31 బుధవారంతో గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌ల ఐదేళ్ల పదవి కాలం ముగిసినందున ఆ స్థానంలో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది.

ఘట్‌కేసర్ రూరల్: పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియడంతో నేటి నుంచి గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన ఉంటుందని ఎంపీడీవో అరుణారెడ్డి తెలిపారు. మండలంలోని 11 గ్రామాల్లో ప్రత్యేక అధికారులు గురువారం సాయంత్రం బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.



మోమిన్‌పేట్: సర్పంచ్ నవనీత విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న సహార యూత్ సభ్యులు

సర్పంచ్ వీడ్కోలు సభలో గ్రామస్తుల కన్నీరు



సర్పంచ్ కుమారుడితో ఏడుస్తున్న మహిళలు

పరిగి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో వీడ్కోలు కార్యక్రమంలో ఓ సర్పంచ్ సేవలను గుర్తు చేసుకుంటూ గ్రామస్తులు కన్నీటిపర్యంతమైన సంఘటన వికారాబాద్ జిల్లాలో గురువారం చోటు చేసుకుంది. పరిగి మండలం ఇబ్రహీంపూర్ సర్పంచ్ కమ్మరి నర్సమ్మకు, వార్డు మెంబర్లకు గ్రామస్తులు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించి సన్మానించారు. భావోద్వేగానికి గురైన మహిళలు సర్పంచ్ నర్సమ్మను, అమె కుమారుడు బాలయ్యను అక్కున చేర్చుకుని కంటతడిపెట్టారు. సర్పంచ్, అమె కొడుకు ఐదేళ్ల పాటు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ కంటతడిపెట్టారు. మరిన్ని రోజులు సర్పంచిగా కొనసాగితే బాగుండంటూ బాలయ్యను పట్టుకొని రోదించారు. సర్పంచ్ మంచితనాన్ని గుర్తుచేసుకున్నారు. గ్రామస్తుల ఆప్యాయత, కన్నీళ్ల మధ్య వీడ్కోలు సమావేశాన్ని ముగించారు. ఎన్నికల్లో మరోసారీ ఆమెనే సర్పంచ్‌గా గెలిపించుకుంటామని గ్రామస్తులు తదితరులు అన్నారు.

సర్పంచులు చరిత్రలో గుర్తుండిపోతారు

వికారాబాద్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తరాలు మారినా.. యుగాలు గడిచినా.. సర్పంచులు చరిత్రలో గుర్తుండిపోతారని రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. అయిదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సర్పంచులకు, ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు ఆమె అభినందనలు తెలిపారు. గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ముగింపు పురస్కరించుకొని సర్పంచుల సేవలు గుర్తు చేస్తూ ఆమె గురువారం ఓపత్రికా ప్రకటన విడుదల చేశారు. మానస పుత్రిక పల్లె ప్రగతి ఫలాలను పల్లెలకు చేర్చడంలో, అభివృద్ధి పరచడంలో మీరు ఎంతో కృషి చేశారంటూ ఆమె సర్పంచులను అభినందించారు.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు

కులకచర్ల, ఫిబ్రవరి 1: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం సాంఘిక సంక్షేమ దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. సాంఘిక శాస్త్రం గురించి విద్యార్థులకు ఎంఈవో హబీబ్ అహ్మద్ వివరించారు. మండల స్థాయి ప్రతిభ పరీక్షా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని అఖిల, ద్వితీయ బహుమతిని ఇందు సాధించగా వారిని కేజీబీవీలో ప్రిన్సిపాల్ దేవి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిగి: టాలెంట్ టెస్ట్‌లో పరిగి మండలంలోని ఆయా పాఠశాలల నుంచి 50విద్యార్థులు పాల్గొని పరీక్షలు రాశారు. ఆ తర్వాత పరీక్షపై మూల్యాంకనం చేసి ప్రతిభ చాటిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులుకు బహుమతులను ఎంఈవో హరిశ్చందర్, హెచ్ఎం శంకర్‌ల చేతుల మీదుగా అందజేశారు.

పంటల వివరాల నమోదు పరిశీలన

తాండూరురూరల్, ఫిబ్రవరి 1: మండలంలోని సంగెంకలాన్ గ్రామ శివారులో ప్రస్తుతం ఏయే పంటలు పండిస్తున్నారనే దానిపై జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ గురువారం పరిశీలించారు. క్రాప్ బుక్కింగ్‌లో భాగంగా గ్రామ శివారులోని రబీ కంది పంట పరిశీలించి వాటి దిగుబడి, పంట విస్తీర్ణం, పంటలకు ఎలాంటి రసాయనిక మందులు, ఎరువులు ఎంత మోతాదులో వాడాలనే విషయాలపై రైతులకు సూచనలు చేశారు. జిల్లాలోని పూడూరు మండలం గొంగుపల్లి, తాండూరు మండలం సంగెంకలాన్‌లో పంటల వివరాల నమోదు చేసేందుకు ఈ గ్రామాలు కేటాయించారని, అందులో భాగంగానే సందర్శించి సమగ్ర వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 1: విదార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందించాలని ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అధికారులను కోరారు. ఘట్‌కేసర్ రెవెన్యూలోని ఘనాపూర్ రోడ్డులో గల మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల హాస్టల్‌ను గురువారంఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులు ఘనాపూర్ రోడ్డులో వీధిలైట్లు లేక చీకట్లో ఇబ్బంది పడుతున్నామని ఎంపీపీకి వివరించారు. అదేవిధంగా ఆటవస్తువులు కావాలని కోరగా ఆయన స్పందించిన ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి త్వరలో సమకూరుస్తానని హామీ ఇచ్చారు.

నేడు వికారాబాద్‌కు కేటీఆర్

వికారాబాద్, ఫిబ్రవరి 1 : బీఆర్ఎస్ వికారాబాద్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొనేందుకు శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. వికారాబాద్‌లోని గౌలికార్ నర్సింగ్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9:30గంటల నుంచి నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీ రంజిత్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఆనంద్ హాజరవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

మహిళలకు చట్టసభల్లో అవకాశం కల్పించాలి

●సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి ● జడ్పీ చైర్ పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి

దౌల్తాబాద్, ఫిబ్రవరి 1: రాజకీయ పార్టీలు మహిళలకు చట్టసభల్లో అవకాశం కల్పించాలని జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఐదేళ్ల పాటు మహిళలు స్థానిక సంస్థల్లో పదవుల్లో ఉండి వాటికి వన్నె తెచ్చేలా పని చేశారని చెప్పారు. గతంలో ఎమ్మెల్యేగా పట్నం నరేందర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ప్రస్తుతం కొడంగల్ నుంచి గెలిచిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో నియోజకవర్గం అభివృద్ధి దిశగా దూసుకువెళ్తుందన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం

మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన సన్మాన కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొని సర్పంచ్‌లను సన్మానించారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర మరువలేనిదని కొనియాడారు. ఎంపీపీ విజయ్ కుమార్, జడ్పీటీసీ కోట్ల మహిపాల్, వైస్ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కేశవరెడ్డి పాల్గొన్నారు.



దౌల్తాబాద్‌లో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్పీ చైర్ పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి

ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలి

తాండూరురూరల్, ఫిబ్రవరి 1 : తమ గ్రామ సమీపంలోని కాగ్నా నది నుంచి అగ్గనూరు గ్రామానికి చెందిన పలువురు అక్రమార్కులు రాత్రివేళల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని వీర్‌శెట్టిపల్లి గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ బీడే నాగప్ప ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ చీమల నర్సింహులు, మంగలి నర్సింహులుతో పాటు పలువురు గురువారం తాండూరు ఆర్డీవో శ్రీనివాసరావు, రూరల్ సీఐ అశోక్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఇసుకను తరలిస్తున్నందున భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీసులు స్పందించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేయాలని కోరారు. నది నుంచి రాత్రివేళల్లో ఇసుకను కరన్‌కోట్, తదితర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.



తాండూరు ఆర్డీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న వీర్‌శెట్టిపల్లి సర్పంచ్, గ్రామస్తులు

పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

కొడంగల్, ఫిబ్రవరి 1: రాబోయే వార్షిక పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సూచించారు. గురువారం కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గత సంవత్సరం తక్కువ ఉత్తీర్ణత శాతం నమోదైందని, ఈసారి వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో రేణుకాదేవి

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 1: ప్రతీఒక్కరు గంటసేపు వ్యాయమం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మల్లారెడ్డి హెల్త్‌సిటీ డైరెక్టర్ చామకూర భద్రారెడ్డి తెలిపారు. మండలంలోని ఎదులాబాద్ ఎ.ఎస్ గ్రౌండ్‌లో గురువారం ఆయన మల్లారెడ్డి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో ఘట్‌కేసర్ ఉమ్మడి మండలంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి 32 జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కాలేరు సురేష్, వంగూరి శివశంకర్, సింగిల్‌విండో డైరెక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి, మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మంకం రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ప్రధానకార్యదర్శ పన్నాల కొండల్‌రెడ్డి, భిక్షపతిగౌడ్, అల్లం శంకర్, చిరంజీవి, ఆశిష్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ఆరుట్ల బాల్‌రాజ్, పూస నందకుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతరకు 40 ప్రత్యేక బస్సులు

తాండూరు, ఫిబ్రవరి 1: మేడారం సమ్మక్క సారక్క జాతర కోసం తాండూరు ఆర్టీసీ డిపోకు చెందిన 40బస్సులను ఉన్నతాధికారులు వారం రోజుల పాటు తీసుకోనున్నారు. తాండూరు డిపోలో 51బస్సులు ఉండగా వాటిలోని 40 బస్సులను ఈ నెల 16 నుంచి ఇతర డిపోలకు పంపించనున్నారు. ఈ బస్సులతో పాటు 80 మంది డ్రైవర్లు, 40 మంది కండక్టర్‌లు ఇతర డిపోల్లో విధులు నిర్వహించబోతున్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

పరిగి, ఫిబ్రవరి 1: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ఘటన గురువారం రాత్రి నజీరాబాద్ శివారులో చోటుచేసుకుంది. మండలంలోని పొల్కంపల్లి గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి మొగిలిగిద్ద శివకుమార్(21), బీటెక్ విద్యార్థి బాయికాడి సాయితేజ(22), పోతర్ల సాయికుమార్‌లు ముగ్గురు కలిసి బైక్‌పై పరిగి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో రంగాపూర్ నుంచి పరిగి వైపు వస్తున్న టాటా ఏసీ వాహనం నజీరాబాద్ వద్ద ఎదురెదురుగా వస్తూ ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న మొగిలిగిద్ద శివకుమార్, బాయికాడి సాయి తేజలు అక్కడికక్కడే మృతి చెందారు. పోతర్ల సాయికుమార్‌కు గాయాలు కాగా, పరిగి అస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతులిద్దరూ ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పరిగి సివిల్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్కూటీని ఢీకొన్న లారీ.. విద్యార్థినికి తీవ్రగాయాలు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 1: లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని తీవ్రగాయాలపాలైంది. ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బి.రాజువర్మ కథనం ప్రకారం.. నాగారం మున్సిపల్, రాంపల్లికి చెందిన పతంగి హర్షిత(20) పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధి యంనంపేట్ శ్రీనిధి ఇంజనీరింగు కళాశాలలో ఈసీఈ సెకండియర్ చదువుతోంది. గురువారం మధ్యాహ్నం కళాశాలలో పరీక్ష రాసి స్కూటీపై తిరిగి ఇంటికి వెళ్తతుండగా, యంనంపేట్ సమీపంలో ఘట్‌కేసర్ నుంచి రాంపల్లి వైపునకు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీ ఒకవైపు దూరంగా పడగా హర్షిత కాళ్లపై నుంచి లారీ వెళ్ళింది. ఆమె రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని హర్షితను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా లారీ నడిపిన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, లారీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హర్షిత తండ్రి పతంగీ వెంకట సుబ్బారావు రైల్వే ఉద్యోగి. ఆయన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భూ యజమానికి బెదిరింపులు.. కేసు నమోదు

కీసర రూరల్, ఫిబ్రవరి 1: భూ యజమానిపై బెదిరింపులకు పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కీసర పోలీసులు తెలిపారు. మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. కేసు మంగళవారం నమోదైనప్పటికీ పోలీసులు గోప్యంగా ఉంచడంతో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కీసర మండలంలోని భోగారం అనుబంధ గ్రామం బర్సిగూడకు చెందిన గుండె మల్లేష్ తండ్రి గుండె బిక్షపతికి 1978లో సర్వేనంబర్ 286/7/97లో నాటి ప్రభుత్వం సాగుచేసుకునేందుకు 30గుటల భూమిని కేటాయించింది. ఆ భూమిలో సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న క్రమంలో కొంత కాలం కిందట బిక్షపతి మృతిచెందాడు. అతడికుమారుడు మల్లేష్ గ్రామ పంచాయతీలో ఉద్యోగం చేస్తున్నందున వీలుకాక చాలా కాలంగా పొలం వద్దకు వెళ్లలేదు. దీంతో పక్కనే వెంచర్ చేస్తున్న జక్క వెంకట్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలు మల్లేష్‌కు చెందిన భూమిని కబ్జాచేసి వెంచర్‌లో కలిపి ప్లాట్లు విభజించారు. మంగళవారం తన పొలం చూసేందుకు వెళ్లగా అక్కడ కంచె వేసి ఉండడంతో మల్లేష్ తన భూమి కబ్జాకు గురైందని గ్రహించాడు. అక్కడ కాపలాగా ఉన్న క్రాంతిని ప్రశ్నించగా దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు వెంకట్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, క్రాంతిలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదుపుతప్పిన టిప్పర్.. తప్పిన ముప్పు

కులకచర్ల, ఫిబ్రవరి 1: ప్రమాదవశాత్తు ఓ టిప్పర్ వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. పుట్టపహాడ్ నుంచి కులకచర్ల క్రషర్‌కు కంకర తీసుకెళ్తున్న టిప్పర్ గురువారం ఉదయం ప్రమాదవశాత్తు అంతారం సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో వాహనంలో డ్రైవర్ ఒక్కడే ఉండగా అతడికి ఎలాంటి గాయాలు కాలేదు. తృటిలో పెను ప్రమాదం తప్పింది.

కల్తీ మటన్ విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

పరిగి, ఫిబ్రవరి 1: కల్తీ మాంసం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ ఎన్.కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నమ్మదిగన సమాచారం మేరకు పరిగి మునిసిపల్ పరిధిలోని విద్యానగర్‌లో నివాసముంటున్న మటన్ వ్యాపారి ఎండీ ఖలీల్ ఇంట్లో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్, పరిగి సత్యనారాయణల బృందం తనిఖీలు చేపట్టింది. కల్తీ మటన్ విక్రయిస్తున్నట్లు తేల్చారు. 20రోజులకు సరిపోను మటన్‌ను ఒకేసారి కట్ చేసుకుని నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు వ్యాపారి ఖలీల్ ఒప్పుకున్నాడని ఎస్పీ తెలిపారు. వ్యాపారిని అదుపులోకి తీసుకుని, అతడి నుంచి 70కిలోల కల్తీ మటన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేయించామని తెలిపారు. జిల్లాలో ప్రజలు ఆచితూచి వ్యవహరించాలని సూచించారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగినా, కల్తీ వస్తువులు విక్రయించినా వెంటనే టాస్క్‌ఫోర్ ఎస్ఐని 8712583483 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

పెద్దమ్మ తల్లి ఆలయంలో చోరీ

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 1: పెద్దమ్మ తల్లి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చొరబడి హుండీని ఎత్తుకెళ్లారు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి గుర్తుతెలియని నలుగురు దుండగులు ఉప్పర్‌పల్లి గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో చొరబడి హుండీని ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఆలయ నిర్వాహకులు వచ్చిచూడగా ఆలయంలో హుండీ కనిపించలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జిల్లా సోషల్ టాలెంట్ టెస్ట్‌కు 10 మంది విద్యార్థుల ఎంపిక

యాలాల, ఫిబ్రవరి 1: ఈనెల 3వ తేదీన(రేపు) నిర్వహించే జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్టుకు యాలాల మండలం నుంచి 10 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఎంఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో సోషల్ టాలెంట్ టెస్టు గురువారం నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో 10మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల బస్వరాజ్, చంద్రశేఖర్, మధుసూధన్‌రెడ్డి, రమేష్, గోపాల్, బుజ్జమ్మ పాల్గొన్నారు.

కోదండరాంపై కేసీఆర్ కుట్ర

తాండూరు, ఫిబ్రవరి 1: తెలంగాణ ఉద్యమ నేత కోదండరాంపై కేసీఆర్ కుట్ర మరోసారి బయటపడిందని టీజేఎస్ తాండూరు ఇన్‌చార్జి, కౌన్సిలర్ సోమశేఖర్ ఆరోపించారు. గత ప్రభుత్వ అవినీతిని చెట్ల సభలో నిలదీస్తారని భయంతోనే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వందల కోట్లు ఖర్చుపెట్టి కోదండరాంను ఓడించారని అన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైతే కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, కుట్రలకు జంకేది లేదన్నారు. కేసీఆర్ నీచ రాజకీయాలను నిరసిస్తూ తెలంగాణ ఉద్యమ కారులు, ప్రజాసంఘాలు, తెలంగాణ జనసమితి కార్యకర్తలు, ప్రజాస్వామిక వాదులు శుక్రవారం నిరసన తెలపాలని విన్నవించారు. ముందస్తు ప్రణాళికతోనే కోదండరాం ప్రమాణ స్వీకారాన్ని వాయిదా వేయించి కోర్టులో కేసువేశారని తెలిపారు.

అక్రమ హోర్డింగ్ నిర్మాణాలపై హెచ్ఎండీఏ కమిషనర్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 1: ఘట్‌కేసర్‌లో హెచ్ఎండీఏ, జాతీయ రహదారి, రోడ్లు భవనాల శాఖ స్థలాల్లో అక్రమంగా కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు హోర్డింగ్‌లు నిర్మించి వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఘట్‌కేసర్ మాజీసర్పంచ్ అబ్బసాని యాదగిరి గురువారం హెచ్ఎండీఏ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఘట్‌కేసర్ పట్టణంలో పలుచోట్ల అక్రమ హోర్డింగ్‌లను ఏర్పాటు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘట్‌కేసర్‌లోని యంనంపేట్ చౌరస్తాలో అవుటర్ రింగురోడ్డు సర్కిల్ నిర్మాణానికి హెచ్ఎండీఏ సేకరించి పరిహారం అందించిన భూముల్లో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అనుచరులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అనుమతులు లేకుండానే రాత్రికిరాత్రి హోర్డింగులను నిర్మించి వ్యాపారాలు చేస్తున్నారని తెలిపారు.

సంక్షిప్తంగా..

● **తాండూరురూరల్:** ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తాండూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగప్ప ఆధ్వర్యంలో మండల యూత్ అధ్యక్షుడు కరన్‌కోట్ జగదీష్ ఆధ్వర్యంలో గురువారం గ్రామ కమిటీలను నియమించారు.

● **మేడ్చల్ టౌన్:** గౌడవెల్లి గ్రామ మాధవరెడ్డి చౌరస్తా వద్ద స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇందిరాగాధీ విగ్రహాన్ని గురువారం ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** అవుషాపూర్ పంచాయతీ అవరణలో గురువారం పంచాయతీ కార్మికులకు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి దుస్తులు పంపిణీ చేసి, శాలువాలతో సత్కరించి, పూలు చల్లి అభినందించారు.

● **వికారాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను గురువారం బీఆర్ఎస్ నాయకులు వడ్ల నందు హైదరాబాద్‌లోని కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

● **తాండూరు:** ఆలయాలకు పాలకమండలిని నియమించేందుకు దేవాదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. 20 రోజుల్లో ఆసక్తి ఉన్నవారు ధర్మకర్త నియామకం కోసం దరఖాస్తు చేయాల్సి ఉంది. ఫైనల్‌గా పాలకమండళ్లను స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఫైనల్ చేస్తారు. తాండూరు పట్టణంలోని భావిగి భద్రేశ్వర దేవాలయంకు సంబంధించి అంశం కోర్టు పరిధిలో ఉన్నందున రెన్యూవేషన్ కమిటీ వేసుకునే అవకాశం ఉంది.

● **శామీర్‌పేట:** తూంకుంట పరిధిలోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ గ్రౌండ్స్‌లో ఈనెల 4న ఉదయం 8గంటల నుంచి మేడ్చల్ జిల్లాస్థాయిలో అథ్లెటిక్స్ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోషియేషన్ కార్యదర్శి స్టాన్లీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

● **మేడ్చల్ టౌన్:** ఈ నెల 18న నిర్వహిస్తున్న విరాట్ హిందూ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొనాలని కోరుతూ మేడ్చల్ పట్టణానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు గురువారం చినజీయర్ స్వామిని కలిశారు. నాయకులు మురళీధర్ గుప్త పాల్గొన్నారు.

● **పరిగి:** స్థానిక లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలోని టీడీపీ కల్యాణమండపంలో గురువారం జరిగిన పూజల్లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు. జడ్పీటీసీ బి.హరిప్రియ పాల్గొన్నారు.

● **వికారాబాద్:** సెంట్రల్ స్కీంలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఎంపీహెచ్ఏ సర్వీసును క్రమబద్ధీకరించి ఏఎన్ఎంలను, ఆశావర్కర్లను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.మహిపాల్, మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లీలావతి అన్నారు. జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు.

● **దోమ:** గత ప్రభుత్వం 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏ కుటుంబ సభ్యులకు పదోన్నతి కల్పిస్తామని హామీ ఇచ్చినా నేటి వరకు అమలుకు నోచుకోలేదని మండల వీఆర్ఏలు గురువారం తహసీల్దార్ పురుషోత్తంకు వినతిపత్రం అందజేశారు.

● **బొంరాస్‌పేట్:** మండలంలోని చెట్టుపల్లితండా కేజీబీవీ పాఠశాలను కాంగ్రెస్ పార్టీ దుద్యాల మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ గురువారం సందర్శించారు.

● **మూడుచింతలపల్లి:** మూడుచింతలపల్లి గ్రామంలోని సాయిబాబా గుడిలో గురువారం మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రత్యేక పూజలు చేసి సాయి బాబా దర్శనం చేసుకున్నారు.

● **కీసర రూరల్:** అప్రమత్తతతో వ్యాధులను అరికట్టవచ్చని నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి అన్నారు. గురువారం నాగారం మున్సిపల్ కార్యాలయంలో కుష్టు వ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు.

● **పూడూరు:** తెలంగాణ ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ దామగుండం రామలింగేశ్వరస్వామి ఆలయానికి పాలక మండలి నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉప కమిషనర్ దేవాదాయ శాఖ హైదరాబాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

● **దోమ:** కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో యంగ్ లీడర్స్ ప్రతినిధులు విద్యార్థులకు పర్యావరణం పరిరక్షణపై సదస్సు నిర్వహించారు.

● **కులకచర్ల:** మండల కేంద్రం నుంచి గురువారం అఖిల భారత హిందు సమాజం ఆధ్వర్యంలో శివస్వాములు శ్రీశైలం గోవు మహా పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ శివస్వాములను సన్మానించారు.

● **కొడంగల్ రూరల్:** ఈ నెల 16వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా కార్మికులు చేపట్టే సమ్మె నోటీసును సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య గురువారం ఎమ్మార్వో సిబ్బందికి అందజేశారు.